"ఇది కన్నది కన్నాక మళ్లీ నాకోసం వొస్తే నాకేమి మనస్కరించ లేదు. రోత అనిపించేది. మా అత్త 'అమ్మాయీ' బుల్లెమ్మా!" అంటే, నాకు అమ్మాయి లాగే కనిపించింది. ఎంతో ప్రయత్నించాను. చాతకాలేదు "ఇప్పుడు మునపటి మల్లేనే వున్నాగా!" అంది. దాంతో నా పేగులు తరుక్కుపోయి, యేడ్చాను. అది ప్రేమ అనుకుని, ప్రేమతో, నన్ను సమీపించింది. ఆ రాత్రంతా అత్తదగ్గిరికి వెళ్దాం అని చూస్తున్నాను. భార్యకి పదిశి వారంరోజుల నుంచి ఆమెని చూడలేదు. గంటసేపు భరించాను. ఇంక ఊపిరాడ్డం దుర్భరమై దాన్ని ఒక్కతోపు తోసి, రెండుతిట్లుతిట్టి బైటికి వెళ్లాను. నాశరీరమంతా మలినమైనట్లు, ఏదో వికారమైన పాపం చేసినట్లు, తోచి, నన్నాగతికి యీడ్చినదానిమీదికోపం పట్టలేక, వెనక్కి వెళ్ళి,

"ఈసారి నన్ను తాకావా నిన్ను చంపేస్తాను కుళ్ళు ముండా! నిన్ను చూస్తేనే డోకు," అని వెళ్లిపోయినాను. తెల్లారేప్పటికి చచ్చిపోయింది యీనదిలోపడి.

## ౮. భాషన్నా తెలీదు

"నేను కొవ్వూరులో పెద్దబోగీలో యెక్కాను. నిండా ప్రజ లున్నారు. కూచోడానికి చోటు లేక తలుపు దగ్గిరగా కూచున్న ఉత్తరహిందూస్తానంవాళ్లని మూటలు తీసి జాగా చెయ్య మని సాజ్ఞ చేశాను. తియ్యడానికి వీల్లేదని ఆపాడు

భాషలో గోలచేశారు. నాకు కోప మొచ్చి మాట లెత్తి కిటికీలోంచి పారేస్తా నని దడిపించాను. ప్రాణం పోతున్నట్టు అరుస్తో చేతు లడ్డం పెట్టి లేచా డో ముసలివాడు. వాడిపక్కన వున్నపిల్లకళ్ళు వాడిగోలని చూసి నవ్వుతున్నాయి. నోరు మాత్రం కళ్లతో సంబంధం లేకుండా యేదో అరుస్తోంది. సరదా పుట్టి ఆ మాట నక్కడే పడేసి ఆ స్తలంలోకూల పడ్డాను. తరవాతకూడానా మొహం చూస్తో ఆకళ్ళునవ్వుతోనే వున్నాయి. కాని ఆనోరుకోపంగా గొణుగుతోంది. నల్లగా నిగ కళ్ళమీదా చెంపలమీదా, జీరాడేజుట్టూ, ఆంధ్రదేశములో యెక్కడా కనపడని పొడుగూ చురుకూ ఐనముక్కూ, మూర్ఛల్లో మూతలు పడుతున్నకళ్ళూ, ఆమె మొహాన్ని చాలా ఆకర్షకంగా చేశాయి. గట్టిగా బిగించినరొమ్ము, గుండ్రని గట్టితొడలూ, నున్నని బుజాలూ, నొమ్ముకొట్టిన బట్టలు కూడా దాచలేకపోయినాయి. మరీ తేరపార చూస్తే పోకిరిగా వుంటుందని తన నెత్తిమీదనించి యేంచూస్తున్నానా అనీ ముసలాడు అనుమానపడతా డేమోనని "బ్రౌనింగ్" తెరిచి నామనసుని బంధించాలని ప్రయత్నిస్తున్నాను. కాని ఆనవ్వుతో మాయిద్దరికీ యేర్పడ్డ రహస్యస్నేహం నామనసుని తొందర పెడుతోనే వుంది. పట్టుకింద నాబుజం చక్కలిగింత 'ఫీల'యింది. ముసలాడు నాడబ్బులకోసం వెతుకుతున్నా డా అని చప్పున పక్కకి కళ్ళుపాల్చిచూశాను. బల్లులలాగు రెండు పల్చనివేళ్లు నాబుజానికీ అనుకునేబల్లకీ మధ్య నున్నాయి. మెరిసే రెండు గోళ్ళు ముఖాలెత్తి నన్ను చూసి నవ్వాయి. ఆ వేళ్లకి చెందిన చెయ్యి ముసలివాడి వెనకనించి నావేపు చాచుకుని వుంది.

యిటునించి ఆమెవంక చూశాను. గోదావరీ నీలజలాన్ని కళ్లలో ప్రతిఫలింపచేస్తో, స్వదేశపరత్వగంభీరత్వస్ఫురణలో మమ్మల్నీ రైలునీ మరిచి ఏమెరగనట్లు కూచుంది. మెల్లిగా వేళ్లు నా మెడనీ, నావీపునీ ప్రేమతో తాకి, నాచేతుల్ని పట్టు వొదిల్చాయి. తిరిగితిరిగి ఒక్కచిరునవ్వుకై ఆమెముఖాన్ని వెతికాను. పైకి తిరిగిన ఆమె పెదవిలో ఒక్కమార్పూ లేదు. ఆమెవేళ్ళని వీపుతో నొక్కాను. మెల్లిగా చేతిని జాచాను. కాని ఆవొడుపూ ఆనేర్పు మొగాడికి నాకు చాతనవుతుందా? ముసలివాడు చప్పున తిరిగి చూశి ఆమెతో కోపంతో యేదో ఒక్కమాట అని వూరుకున్నాడు. గోదావరిలో రైలాగగానే మూటలు పట్టుకుని కిందికి దిగి ఆమెని దిగ మన్నాడు. ఆమె దిగ నంది. కోపంతో కేకలేశాడు. తన స్తలంనించి కదలక యేదో వాదిస్తుంది. యిట్లా రెండునిమిషాలు గోలపడి మూటలు కిందపారేశి, లోపలికొచ్చి దాన్ని జుట్టుపట్టుకుని బరబర యీడ్చాడు. యిద్దరుముగ్గురు సగంసగం అడ్డపడపోయి తమ కెందుకని వూరుకున్నారు. పడుచు దానికోసం పోట్లాడడం అందరికీ యిష్టమే కాని భయమే, సిగ్గే. కిందికి లాగి గుండెలో గుద్ది, మూటలు దానిమీద పడేసి నడిపిస్తున్నాడు. ఒక్కనిమిషంలో మేమూ నలుగురైదుగురం కిందికి దిగాము. తక్కిన వాళ్లకి తమాషాగా వుందిగావును. కాని నా కాముసలాణ్ణి తన్ని, ఆమెని వొదిలించా లని అణుచుకున్నకొద్దీ తుపాను లేస్తోంది. నావంక నవ్వినచిరునవ్వు, నాభుజాల్ని తాకించిన మాధుర్యం, నాకోసం నావల్ల ఆమె పడుతున్న బాధ—కాని నేను పోట్లాడితే వీళ్లందరూ యేమనుకుంటారు?

మధ్య నీకెందు కంటే యేంచెప్పను? అదిగాక యీపిల్లకి మాత్రం ధైర్య ముంటుందా? వాడివేపే పలకదా? ఆమె చూపులు చూస్తేమాత్రం వాణ్ని ఆత్మజ్ఞానకాల్చేట్టు, కత్తితో నరికేట్టో వున్నాయి. రాజమండ్రి స్టేషన్లో దిగి, వెళ్లి చూశాను యింజనుపక్క పెట్టెలో వున్నారు యిద్దరూను. నన్ను చూసి, ఆదరణగా జాలిగా, ముఖం పెట్టింది. యేంచెయ్యను? వెనక్కి వొచ్చాను. కాని యిట్లాంటివాడితో ఆమె యెంతబాధ పడుతోవుండాలి దినదినమూ? చెప్పగు నేందుకు, అర్థం చేసుకునేందుకు, తనభాషైనా తెలిసినవాళ్లు లేక యీ పరదేశంలో వాడు చంపుతూవుంటే—యింకా యేంచేస్తాడో? యెక్కడికి వెడుతున్నారో? నామీద యెంత ఆశ పెట్టుకుందో? యెంత విశ్వసించిందో? కనుక్కుంటే? వెళ్లి వాళ్ల పెట్టెలో యెక్కి యెదురుగా నుంచున్నాను. చప్పున నురుగులుకక్కుతో లేచి మూట లొకచేత్తో, ఆపిల్ల జెబ్బ నొకచేత్తో పట్టుకొని దిగాడు. పక్కనున్న ఆడవాళ్ల పెట్టె లోకి ఆమెని తోసి, తను యింకో పెట్టెలో యెక్కాడు. కడి యుందాకా నామనసు మనసులో లేదు. ఆస్టేషన్లో వెళ్లి ఆమె కెదురుగా ప్లాట్‌ఫారంమీద నుంచున్నాను. లోపలి దీపాలవెలుతు రింకా బైటికి పడటం లేదు. పొలాలమీద చల్లనిగాలి వింతగా రైల్ని యిదేమి వొస్తువా అని అనుమానంతో తాకి చూస్తోంది. స్టేషనుమాష్టరు యింట్లోంచి పొగ మెల్లగా వేస్తోంది. చంద్రకాంతపువ్వులు విచ్చాయి. బళ్లవాళ్లు అరుస్తున్నారు బేరాలకై. కిటికీలోంచి జార్చినచెయ్యిని పట్టుకున్నాను. ఆమెవేళ్లు నావేళ్ళపైన బిగుసుకున్నాయి. గంట

కొట్టారు. ఆవేళ్లు వొదలలేను. నాకళ్లు ఆమెమొహంనించి పొడుగాటిరోడ్డువేపు తిరిగాయి. దయగల ఆవేడివేళ్ళని పట్టుకుని లోకమంతా యెంతదీర్ఘప్రయాణం చేస్తేనేం? రైలు కదులుతోంది. కొంచెంనడిచాను. ఆగి ఆచెయ్యిని పట్టుకునే వున్నాను. రైలు ఆమెని లాగింది. ఆపెట్టెలో ఆమెకాక యింకో ముసలమ్మమాత్రమే వుంది. నేనూ యెక్కితే నేం? అని చెయ్యిని అట్లానే పట్టుకుని రెండోచేత్తో తలుపు తెరిచాను. అది చూసి ఆమె చప్పున లేచి తలుపుకి అడ్డంగా నుంచుంది, రానీదు. నాప్రాణం చివుక్కుమంది, నేనింకా రైలు వెంటనడుస్తున్నాను వెనక యెవరో కేక వేస్తున్నారు. చప్పున నాబుజంమీద చెయ్యేసి ఆమె నాపక్కకి దూకింది. అమ్మా, భాష రాకపోవడంవల్ల యెంతప్రమాదం జరిగింది! నేను తనని దిగమని తలుపు తీశాననుకుంది. ముసలాయనా, మూటలూ, నాట్రంకూ, దాంట్లో నాభార్యనాగ సొత్తులూ, నా యల్. టీ. సర్టిఫికేటూ, నాకాకినాడప్రియురాలి వుత్తరాలూ, అన్నీ దూరంగా, యెర్రదీపంముందు, నన్ను చూచి భయపడ్డట్టు పరిగెత్తుతున్నాయి. నిర్విణ్ణుణ్ణాయి ఆమె మొహంవంక చూస్తో నుంచున్నాను. మాట్లాడక తెల్లబోయి, చిన్నపిల్లవలె నేనేమంటానో అని నావంక చూస్తోనుంచుంది. 'కావలిసేదిగానా?' అనీ, యింకేమో అడగబోయి, నవ్వువచ్చి వూరుకున్నాను. ఆమె వుద్దేశ్యమేమో తెలీడమెట్లా? ఎవరికైనా హిందుస్తానీ తెలుసునేమో? కాని యీవ్యవహారం యెవరికిచెప్పుకోను? స్టేషన్లో మనుషు లందరూ వెళ్ళిపోయినారు. మాఆలోచనా సంఘంలో చేరతలివినట్లు ఒక కుంటికుక్కవొచ్చి తోకాడించి

మా మొహాలు చూస్తో నుంచుంది. పడమటనించి తెల్లనిరంగు ఆమె మొహంమీద పడ్డది. మా పక్కన బస్తాలలోంచి, తాపూ, పచ్చిమిరపకాయలూ కలిసిన వాసన వేసింది. గాసీమనోహరి పూలు యెండాకాలపు గాలిలో వూగాయి. టికెట్లవాడొచ్చాడు. కాకినాడకి కొన్నటిక్కెట్లతని చేతులో పెట్టాను. ఆమెనడిగాడు. యేం చెప్పను? ఆమె మాట్లాడక నుంచుంది. తెనుగులో హిందూస్తానీలో అడిగాడు. మాట్లాడలేదు. నావంక తిరిగాడు. గోల యెందుకని రూపాయ జేబులోనించి తీసి చేతులో పెట్టాను. రెండు నిమషాలు మా యిద్దరివంకా చూసి, వెళ్ళిపోయి స్టేషనుదగ్గిరగా నుంచుని చూస్తున్నాడు. ఆమె ముఖమే చెపుతోంది మా యిద్దరికీ సజావైన సంబంధం లేదని. మాటన్నా వీలులేని ఆమెని వెంటేసుకుని నడిస్తే, ప్రజలందరూ యేమంటారు? యెక్కడికి పోనూ? యేం చెయ్యను? యెంతకాలమని? తలెత్తి యెవరిమొహం చూడ్డానికీ సిగ్గుగావుంది. కాని ఆమె నా పక్కన ఆ అమాయకంగా విశ్వాసం వుట్టిపడే కళ్ళతో, గుండ్రని చేతులతో, నల్లని జుట్టుతో, ముందు నే ననుభవిస్తా ననుకునే సౌఖ్యాల ఆశలతో నా పక్కని నుంచున్నదనే సంతోషంలో, అన్నీ మరిచిపోయినాను. నాబట్టలూ భార్య సొమ్ములూ, పుస్తకాలూ పోతేనేం? జేబులో యాభై రూపాయలూ పక్కని యీ పిల్లా వుంది. యింకేం కావాలి? యీనాడు అట్లా అనుకోనేమో, కాని ఆ నాడు అట్లా అనుకోని వాణ్ణైతే, యెంత నిర్భాగ్యుణ్ణి ఐవుండాలి? నా పెట్టె కోసం చామర్లకోట టెలిగ్రా మియ్యాలనుకున్నాను. కాని నే నెక్కడవున్నానో ముసలాడు కనుక్కుంటే. యేమీ

# పాపం!!!

యోచనలేకుండా స్టేషన్ దాటి యెర్రదుమ్ముతో నిండిన రోడ్డంబడి ఆమె వెనకా నేను ముందుగా నడిచాము. వూళ్ళోకి వెళ్లడమంటే భయంగా వుంది. యెవరైనా యేదో వొకటి అడుగుతారు. యేం చెప్పను?. చిన్న తోటవుంది రోడ్డుప్రక్కన. యిద్దరమూ అరటిచెట్లుక్రింద కూచున్నాము. చీకటి పడుతోంది గోరువంకలు యెదురుగా ఆమదంచెట్టుమీద మాట్లాడుకుంటున్నాయి. మా కాళ్ళముందు నీళ్ళమడుగులో బాతులు రెండు యీత్తున్నాయి. మా నెత్తిమీద బృహస్పతి వుదయించాడు. నేనామె బుజంమీద చెయ్యేసి ముఖమెత్తి తడిపెదవుల్ని ముద్దుపెట్టుకున్నాను. లేచాము. బాగా చీకటయింది. దూరంగా కనపడుతున్న దీపాలవేపు నడిచాము. దోవలో మళ్ళా ఆమెను దగ్గరగా లాక్కుని పక్కగా వొత్తుకున్నాను. జీవితమెంతో ఆనందంగా కనపడ్డది. తిండి లేకపోతేనేం, యిల్లులేకపోతేనేం, ఆ యెండాకాలపు పైరుగాలిలో నక్షత్రాలకింద యే గడ్డిలో పడుకుంటేనేం? ఆమె జుట్టు నా చేతులమీద జీరాడుతో, ఆమె మెత్తని చల్లనిశరీరం నా కానుకుని పడుకుంటే నాకేంకావాలి? దీపాలదగ్గిరిగా వొచ్చాము. అది బోట్లరేవు. యీ బోటులో యెక్కి వెళితే, యెక్కడికైతేనేం ? అయిదు నిమిషాల్లో గది మాట్లాడి ఆమెని లోపలి కెక్కించాను. మిటాయీ, పళ్ళూ, కొనితిన్నాము. చీకట్లో గదిలో ఆమెపక్కన కూచున్నాను. మాట్లాడకండా కూచుంది. ఆమె నన్ను పలకరించాలని యెదురుచూశాను. ఆమె కదలలేదు. నాకోసం రైలులో అంత ఆదుర్దాపడ్డమనిషి యిట్లాకూచుందేం? దిగులుగా వుందా? ఆకలేస్తుందా? యే వూరు? ఆ ముసలా డెవరు?' అని

'అడగాల్లని వుంది. కాని ఎట్లా ? ఆమెకి నిజంగా నామీద మనసుందనీ, పోనీ, నా పైనే తను యిప్పుడు ఆధారపడి వున్నదనీ, ఆమెకి తెలియచేసేట్టు చెయ్యాలని వుద్దేశ్యపడ్డాను. కిందికి దిగుతున్నట్టుగా జరిగాను, మాట్లాడ్డ లేదు. దిగి యిటూ అటూ వెడుతున్నట్టు తిరిగాను. చప్పుడు లేదు లోపలికి చప్పున వెళ్ళి విప్పినకోటు వేసుకుని బైలుదేరి, ఆమెవంక చూశాను. వేలన్నా కదిలించలేదు. నా కెంతో కోపం వొచ్చింది. అరగంటసేపెక్కడో కూచున్నాను. పడవ బాకా వూదారు. లోపల వొచ్చి కూచున్నాను. ఆమె తలన్నా యెత్తలేదు. రైల్లో పోయిన నాగొత్తులకి, 'షా' పుస్తకాలకీ దిగు లుదయించింది. మొహం నీళ్ళకేసి తిప్పేసి, ఆమెతో నా కేం సంబంధం లేనట్టు ఠీవిగా. సిగరెట్ కాలుస్తో, కూచున్నాను. పడవ కదిలింది. పడవపక్కన నీళ్లు రొదపెడుతో పరిగెత్తుతున్నాయి. ఆ ప్రవాహంలో నక్షత్రాలు తేలిపోతున్నాయి. గట్లమీది నీడలు గంభీరంగా మూలుగుతున్నాయి. యింక తాళలేక, నా అమ్మాయి కేసి జరిగి చెంపకింద చెయ్యేసి మొహం తిప్పుకున్నాను. వేడిగా నీళ్లు నా వేళ్లకితగిలాయి. పాపం ముక్కూ మొహమూ యెరుగని నాతో సాహసంచేసి వొచ్చేసిన యీ ముగ్ధ, యెంత భయపడుతోందో ? భామన్నా నాకు అర్థం కాదుకద ! నే నేంచేసినా పడవలిసిందేకద ! యింక నాకంటె దిక్కులేక, నన్నే నమ్మిన యీ అబలపైన నామీద మోహం చూపలేదని నిష్కారణ ద్వేషాన్నిపూని, యిట్లా భయపెట్టి బాధించానుకదా, అని చాలా విచారంకలిగింది. ఆమె తలను గట్టిగా నా కదుముకుని "యెందుకు దుఃఖం, నా పిచ్చిపిల్లా!

నిన్ను వొదిలాననుకున్నావా? నిన్ను వొదిలేస్తానా? నే నున్నానుగా? నా కంఠంలో ప్రాణమున్నన్నాళ్లు నిన్ను వొదులుతానా? యెందుకు విచారం? యిట్లారా." అన్నాను.

యామనుకుందో ఆ మాటలకి అర్థం; మొహం నాకు వొదిలేసి, ప్రతిమలాగు కూచుంది. యేమేమో మాట్లాడించాను. నాకు తెలిసిన రెండు హిందుస్తానీముక్కలూ, "ఆవ్, జావ్ ఖానా కాయా? కోఈబస్తీ" యివికూడా పలికాను. అట్లానే కూచుంది. మళ్లీ యేవో ఆలోచనల్లో పడి నల్లని గట్లకేసి వాటిల్లో మెరిసే మిణుగుర్లు పురుగులకేసి చూస్తో కూచున్నాను. యెదో లాకులవద్ద పడవ ఆగింది రాత్రియిట్లానే గడుస్తోందే? నా పైని యెంతో మోహం చూపవలసిన యీ పిల్ల మూటలాగు మూల కూచునివుందే? నిద్రన్నా పోదు. యింత త్యాగమూ వృధా కావలసిందేనా? నిద్రరాదు. ఆ మోహాంవేపే గాలిలో పడవ సాగగానే ఆమెదగ్గిరకివెళ్లి చాలా చనువుగా కౌగలించుకున్నాను. మెల్లిగా నా మొహాన్ని నెట్టేసి, తల తిప్పుకుని కూచుంది. యెందు కంతసిగ్గు! మళ్ళీ మళ్ళీ సమీపించాను. రెండు నిమషాలు వోర్చుకొని తరవాత నిరాకరిస్తుంది. మొదట్లో ఆ అభ్యంతరంకూడా ఆకర్షకంగానే వుంది. వుత్తబిడియం. మొగాణ్ణి నేను చొరవచెయ్యకపోతే యెట్లా? వెళ్ళి కామంతో మోటుసరసం ప్రారంభించాను. స్త్రీని ప్రేరేపించేందుకు వాచ్యాయను డేమన్నాడా అని యోచించాను. నన్ను వొదుల్చుకొని గది బైటికి వెళ్ళింది. యేమి అవసరమోనని కూచున్నాను. యెంతసేపటికీ రాదు. వెళ్లి చూస్తే టాపుమీద యెవరో కాపు ఆడవాళ్ళ దగ్గిరగా కూచుని

వుంది. యెట్లాతీసుకురాను లోపలికి? యేమని పిలవను? పెళ్లి దగ్గిరిగా కూచుని వాళ్లు చూడకండా చెయ్యిపట్టుకులాగాను. కాని యింకా వాళ్లదగ్గిరగా జరిగింది. వాళ్లు నవ్వుతున్నట్టు తోచింది నాకు, అధికకోపంతో వొచ్చి గదిలోకూచున్నాను దాన్ని కాలవలో తొయ్యాలనిపించింది. కృతఘ్నురాలు! అయినా నా చేతుల్లోంచి యెక్కడికిపోతుందిలే! కాని ఆ రాత్రి వృథాగా గడపవలసిందేనా? నా ట్రంకు పోగొట్టుకున్నదీ, 'కాన్ఫరెన్సు'కి వెళ్ళడం మానేసింది. యిందుకేనా డబ్బుతీసుకుని, వాగ్దత్తంచేసి, మోసంచేసి నిరాకరించే బోగం దానిమీదవలె ఆగ్రహం కలిగింది దానిమీద. దీన్నేంచేస్తే యేం తప్పు? అనుకుంటో ఆకోపంలోనే నిద్రపోయి, యెప్పుడో వులికిపడి లేచాను నల్లులు కుడుతున్నాయి. సుఖంగా లక్ష్మణ రావుతోనూ, అతని చెల్లెలితోనూ, మన్న సుబ్బరావుతోనూ, 'కాన్ఫరెన్సు'లో తిరుగుతో, రామవిలాస్ నాటకాలుచూస్తో వుండవలసినవాణ్ణి, యిట్లా యీ చెక్కలమీద, వొంటరిగా పడి రాజమండ్రీవేపు పోతోవుండేగతి పట్టిందికద! యింతమూర్ఖుణ్ణెట్లా ఐనాను? యీ పరదేశికన్య నెట్లా నమ్మాను? స్త్రీల మీద కోపంతో పురాణాల్లో రాసినసంగతులన్నీ జ్ఞాపకానికి వొచ్చాయి. కాని ఆ అమ్మాయి రైల్లో యెంతప్రేమచూపింది! నన్ను నమ్మి, ఆ ముసలివాణ్ణి వొదిలి—యిప్పుడే ఆమె నా పక్కన పడుకునివుంటే—యిరవై కాన్ఫరెన్సులూ, యిరవై సుబ్బరావులూ, ముప్పై స్త్రానం నరసింహారావులూ, యెందుకు ఆఅనుభవముందు? నే ననుభవించగలిగి వుండే ఆనందమంతా స్ఫురణకువొచ్చి కోపమొచ్చింది! నన్నుచూసి నాకే జాలి

వేసింది! నన్ను కోరివచ్చిన పిల్లని పోగొట్టుకున్న నిర్భాగ్యుణ్ణి. ఆ ముసలాడిమాత్రం చెయ్యలేకపోయినాను. వాడట్లా జుట్టు పట్టుకుని యీడ్చి గుద్దితే బాగా నేవ్పుంది! నే నింత గౌరవంచేసి కోరితే టెక్కు చేస్తోంది. యిట్లాకాదు వీళ్లని సాధించేమార్గం కార్యన్యమే! బైటికివెళ్ళి టాపుపైకి చూశాను. స్త్రీలందరూ నిద్రపోతున్నారు. ఆమె మాత్రం మేలుకుని కూచుంది. దగ్గిరికి వెళ్ళి చెయ్యిపట్టుకుని మెల్లిగా లాగాను. వెనక్కి లాక్కుంది. నడుంచుట్టూ చేతులువేసి గారాబంచేసి రమ్మన్నాను. వెనక్కి జరిగింది. నాకు చాలా కోపమొచ్చింది. యింత యిష్టంలేంది నన్నెందుకంత మోసపుచ్చాలి? చప్పున జుట్టు పట్టుకుని క్రిందికి లాగాను. చెక్క మీదికి జారింది. మెడపట్టుకుని ఒక్క తోపు తోశాను. మోకాళ్ళమీద పడ్డది. వ్యవధానమివ్వక వెంటనే లోపలికి తోశాను. తెప్పిరిల్లడానికీ, అరవడానికీ వ్యవధిలేక గదిలో చెక్కలమీద పక్కగా పడ్డది. వెంటనే వెళ్ళి వెల్లకితలా తిప్పి చంకలదగ్గిర చేతులు అదిమి మోహంతో ఆమెను సమీపించాను. చేతులతో బలంగాతోసింది నన్ను. అభ్యంతరమేమో కనుక్కునే వీలులేదు. ఏంచెయ్యను? ఈ పెంకెతనానికి, అన్యాయానికి కోపం యెక్కు వవుతోంది నాకు.. నా బలమంతా వుపయోగించి, ఆమెచేతుల్ని విరిచి, అదిమి ఆక్రమించుకున్నాను. కాని బలమైన ఆ చేతులు నా కోకపట్టాన స్వాధీనమౌతాయా? ఆ చీకట్లో యింక నాఅమ్మాయీ నేనూ భీమ చకులవలె మల్లయుద్ధం మొదలుపెట్టాము. ఆమెదిరొట్టెలబలం, వరిఅన్నంగాణ్ణి యెంత మొగాణ్నైతేమాత్రం గెలవగలనా? యేం చెయ్యలేక రోషమొచ్చి, తలకాయి చెక్కల్ని వేసి

కొట్టాను. నా చేతుల్ని తనచేతుల్లో విడతీసి పట్టుకుని, యింక యేంచేస్తావని చూస్తోంది, కళ్ళమీద పడ్డ జుట్టులోంచి. చప్పున చేతులు వొదుల్చుకుని మళ్ళీ కలియపడ్డాను. వొగరుస్తూ, మధ్యమధ్య మెల్లిగా యేవో అంటోంది తన భాషలో! తిట్లేమో నని నాకు సిగ్గేసింది. మీద కూచున్న నన్ను తోసేసి లేవబోయింది. యింక నా శక్తి ఆగదని తోచిందినాకు. యింక అన్యాయయుద్ధం ప్రారంభించాను. యిష్టమొచ్చిన బూతులన్నీ నోటినిండా తిట్టుకున్నాను. ఆ పడవచెక్కలన్నీ విరిగేటట్టు వూగాయి. యేమైతేనేం నల్లులన్నీ చచ్చివుంటాయి. కింద అసహాయంగా పడివున్న ఆమెని జుట్టంతా పీకాను. బుజాలూ, చెంపలూ, రొమ్ము కొరికాను, గోళ్ళు గుచ్చాను. రెవిక ఒక్క వూపుతో చించి ఆ వక్షాన్ని చూసి జయభేరి మోగించి నవ్వాను. నేనుచేసిన గాట్లరక్తం నా నోట్లోనే చిమ్మింది. అరవదు, మాట్లాడదు. పూరికే పెనుగుతుంది. ఆ ముద్దుభాషలో యేమిటో తిడుతుంది. వివస్త్రయిన ఆమెని చూడగానే, నిగనిగలాడే ఆమె తొడలూ, అంటుకునివున్న ఆమె నడుమూ, చూడగానే నాకు మళ్ళీ కోపం పోయి కామం మెక్కువయింది. మళ్ళీ చివరసారి గట్టిగా ప్రయత్నించి, మెలిక వేసి బిగబట్టిన ఆమె చేతుల్ని కాని, కాళ్ళనిగాని కదిలించలేక యెంత ప్రయత్నించినా వుండవలె ఆమె అంతా దొర్లడంచేత నిరాశపుట్టి నిస్సహాయుణ్ణాయి చూస్తో కూచున్నాను. నా వుద్ధ్రుతం తగ్గి పశువువలె ప్రవర్తించిన నా క్రూరత్వానికి, లజ్జాహీనత్వానికి నేను సిగ్గుపడి, ఆమెకి మొహంచూపలేక బైటికివొచ్చాను. కాని ఆమెమీది

కోపంపోలేదు. తలుచుకున్నప్పుడల్లా నాకు మండిపోతోంది? యింతలో ఆమె సొమ్మసిల్లిపోయింది? అనే భావం వదలదు. పడవ ఆగింది. దూకేశి వెళ్ళిపోయినాను వూళ్ళోకి. వూరుపేరన్నా యెవర్నీ అడగలేదు. ఆమా? ఆమె యేమయిందో! రెవికా, చీరా, లేదంటావా? నే నేంచెయ్యను?

---

# ౯. మచ్చలు

పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు భవానిరావు 'డ్యూటీ'మీద వెడుతోవుంటే, నేను వెళ్లాను. బ్రాహ్మణ వీధులలో చిన్న పురాతనపు పెంకుటిల్లది. దాని ముందు పెద్ద గుంపు పోగయింది. పోలీసు జవాను అడ్డం నుంచుని ఎవర్నీ లోపలికి పోనివ్వటంలేరు. మే మిద్దరమూ నడవాలోంచి లోపలికి వెళ్లాము. కిటికీకింద మూలనున్న పెద్ద నవారు మంచంమీద ఆపిల్ల శవం పడివుంది. మాసిపోయిన చంగావి చీరా, నల్లని రెవికా రక్తంతో తడిసి వున్నాయి. మెడకింద వాడు పళ్లతో చీల్చిన గాయం కనపడుతోంది. ఎదిగినవాళ్ల కెవరికీ అంత చిన్న పిల్లను నే నెన్నడూ చూడలేదు. ఆ అమాయకమూ, విశ్వాసమూ, ఆశ్చర్యమూ, కళ్లు మూతలుపడివున్న, ఆచిన్న పెదవి వొంపులో, ఆ గడ్డం కొనలో, ఆ కనుబొమ్మలు కలుసుకోడంలో నాకు కనపడ్డాయి. నిద్దట్లో భయమేసి యేడుస్తున్నట్టే ముద్దుగా జాలిగావుంది. భవానిరావు 'నోట్సు' తీసుకుంటున్నాడు. నన్ను బాధించే జాలిని భరించలేక బైటికి వెళ్లాను.